30-06-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

**" మధురమైన పిల్లలారా - ఇప్పుడు మీరు పూజారుల నుండి పూజ్యులుగా అవుతున్నారు, మిమ్మల్ని తమ సమానము పూజ్యులుగా చేసేందుకు పరమపూజ్యులైన తండ్రి వచ్చారు. "**

ప్రశ్న :- పిల్లలైన మీలో ఎలాంటి దృఢ విశ్వాసముంది ?

జవాబు:- మేము జీవించి ఉండగానే తండ్రి నుండి పూర్తి ఆస్తిని తీసుకునే తీరుతాము, బాబా స్మృతిలో ఈ పాత శరీరాన్ని వదిలి, తండ్రి జతలో వెళ్తాము. బాబా మాకు ఇంటికి సహజ మార్గాన్ని తెలియచేస్తున్నారనే దృఢ విశ్వాసము పిల్లలైన మీలో ఉంది.

**పాట:- ఓం నమ: శివాయ.....**

**ఓంశాంతి.** ఓంశాంతి అని చాలామంది మనుష్యులు అంటూ ఉంటారు. పిల్లలు కూడా ఓంశాంతి అని అంటారు, లోపల ఏ ఆత్మ అయితే ఉందో అదే ఓంశాంతి అని చెప్తుంది. కాని ఆత్మలు తమను తాము యథార్థ రీతిలో తెలుసుకోలేదు, అలాగే తండ్రిని గురించి కూడా తెలియదు. భలే పిలుస్తారు కానీ నేను ఎవరో, ఎలా ఉంటానో.... అలా యథార్థ రీతిలో ఎవ్వరికీ తెలియదు. ఇంతకుముందు నేను ఎవరు, ఎక్కడ నుండి వచ్చాను అని స్వయం(బ్రహ్మ) కూడా తెలిసేది కాదు అని ఈ బ్రహ్మ కూడా చెప్తున్నారు. ఆత్మ అయితే పురుషుడు కదా. ఆత్మ కుమారుడు, పరమాత్మ తండ్రి. కనుక ఆత్మలు పరస్పరములో సోదరులు తర్వాత శరీరములోకి వచ్చినందున కొందరిని స్త్రీలని, కొందరిని పురుషులని అంటారు. కాని యథార్థంగా ఆత్మ అంటే ఏమిటో మనుష్యమాత్రులెవ్వరికీ తెలియదు. ఇప్పుడు పిల్లలైన మీకు ఈ జ్ఞానము లభిస్తుంది, మళ్లీ మీరు దీనిని జతలో తీసుకెళ్తారు. మేము ఆత్మలము, ఈ పాత శరీరాన్ని వదిలి మరొక శరీరాన్ని తీసుకుంటాము అనే జ్ఞానము అక్కడ ఉంటుంది. ఆత్మ పరిచయాన్ని జతలో తీసుకెళ్తారు కాని ఇంతకుముందు ఆత్మను గురించి కూడా తెలియదు. ఎప్పటి నుండి పాత్రను అభినయము చేస్తున్నారో కూడా తెలియదు. కొందరు ఇప్పటి వరకు కూడా స్వయాన్ని పూర్తిగా గుర్తించలేదు. స్థూల రూపములో తెలుసుకున్నారు, పెద్ద లింగ రూపాన్నే స్మృతి చేస్తూ ఉంటారు. నేను ఆత్మ బిందువును, తండ్రి కూడా బిందువే. ఈ రూపములో స్మృతి చేసేవారు చాలా తక్కువ మంది ఉన్నారు. బుద్ధి నెంబరువారుగా ఉంది కదా. కొందరు బాగా అర్థము చేసుకుని ఇతరులకు కూడా అర్థం చేయించడం ప్రారంభిస్తారు. స్వయాన్ని ఆత్మ అని తెలుసుకొని తండ్రిని స్మృతి చేయాలని మీరు అర్థం చేయిస్తారు, వారే పతితపావనులు అని మీరు చెప్తారు. మొదట మనుష్యులకు ఆత్మ పరిచయమే లేదు. కనుక అది కూడా అర్థము చేయించవలసి ఉంటుంది. స్వయాన్ని ఆత్మ అని ఎప్పుడు నిశ్చయము చేసుకుంటారో, అప్పుడు తండ్రిని కూడా తెలుసుకోగలరు. ఆత్మనే గుర్తించలేదు కనుక తండ్రిని కూడా పూర్తిగా తెలుసుకోలేదు. ఆత్మలైన మనము చిన్న బిందువులము అని ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు. ఇంత చిన్న ఆత్మలో 84 జన్మల పాత్ర ఉంది. ఇది కూడా మీరు అర్థం చేయించాల్సి వస్తుంది. లేకుంటే కేవలం జ్ఞానము చాలా బాగుందని, భగవంతుని కలుసుకునే మార్గము చాలా బాగా అర్థం చేయిస్తారని చెప్తారు. కాని నేను ఎవరు, తండ్రి ఎవరు? అని తెలుసుకోలేరు. కేవలం బాగుంది - బాగుంది అని అంటారు. కొందరైతే వీరు నాస్తికులుగా చేస్తారని కూడా అంటారు. జ్ఞానము యొక్క వివేకము(తెలివి) ఎవ్వరిలోనూ లేదని

కూడా మీకు తెలుసు. ఇప్పుడు మనము పూజ్యులుగా అవుతున్నామని మీరు అర్థము చేయిస్తారు. ఇప్పుడు మనము ఎవ్వరినీ పూజించము, ఎందుకంటే మనము సర్వులకు పూజ్యులైన ఉన్నతాతి ఉన్నతుడైన ఆ భగవంతుని సంతానమని మీరు చెప్తారు. వారు పూజ్యులైన పితాశ్రీ. ఆ పితాశ్రీ మనలను తమవారిగా చేసుకొని చదివిస్తున్నారని ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు. అందరికంటే ఉన్నతాతి ఉన్నతమైన పూజ్యులు వారొక్కరే. వారు తప్ప వేరెవ్వరూ పూజ్యులుగా చేయలేరు. పూజారులు తప్పకుండా పూజారులుగానే చేస్తారు. ప్రపంచములో అందరూ పూజారులే. ఇప్పుడు మీకు పూజ్యులు లభించారు, వారు తమ సమానంగా చేస్తున్నారు. మీ నుండి పూజను విడిపించారు. తమ జతలో తీసుకెళ్తారు. ఇది ఛీ - ఛీ(పాడైపోయిన) ప్రపంచము. ఇది మృత్యులోకము. రావణ రాజ్యము ప్రారంభమైనప్పటి నుండి భక్తి ప్రారంభమయింది. పూజ్యుల నుండి పూజారులుగా అవుతారు మళ్ళీ పూజారుల నుండి పూజ్యులుగా తయారు చేసేందుకు తండ్రి రావలసి వస్తుంది. ఇప్పుడు మీరు పూజ్యులైన దేవతలుగా అవుతున్నారు. ఆత్మ శరీరము ద్వారా పాత్రను అభినయిస్తుంది. ఆత్మను పవిత్రంగా చేసేందుకు ఇప్పుడు తండ్రి మనలను పూజ్య దేవతలుగా చేస్తున్నారు. కనుక పిల్లలైన మీకు యుక్తిని తెలియజేశారు - తండ్రిని స్మృతి చేయుట ద్వారా మీరు పూజారుల నుండి పూజ్యులుగా అవుతారు. ఎందుకంటే ఆ తండ్రి సర్వులకు పూజ్యులు. ఎవరైతే అర్ధకల్పము పూజారులుగా అవుతారో, వారు మళ్ళీ అర్ధకల్పము పూజ్యులుగా అవుతారు. ఈ పాత్ర కూడా డ్రామాలో ఉంది. డ్రామా ఆదిమధ్యాంతాల గురించి ఎవ్వరికీ తెలియదు. ఇప్పుడు తండ్రి ద్వారా మీరు తెలుసుకున్నారు, ఇతరులకు కూడా తెలియజేస్తారు. స్వయాన్ని ఆత్మ బిందువని తెలుసుకోండి అని మొట్టమొదటి ముఖ్యమైన విషయము అర్థము చేయించాలి. ఆ నిరాకారుడే ఆత్మల తండ్రి, ఆ జ్ఞానసాగరులే వచ్చి చదివిస్తున్నారు. సృష్టి ఆదిమధ్యాంత రహస్యాలను అర్థం చేయిస్తారు. తండ్రి ఒక్కసారి మాత్రమే వస్తారు. వారిని తెలుసుకోవడం కూడా ఒక్కసారి మాత్రమే. వచ్చేది కూడా ఒక్కసారి సంగమ యుగములో మాత్రమే. పాత పతిత ప్రపంచాన్ని పావనముగా చేస్తారు. ఇప్పుడు బాబా డ్రామా ప్లాను అనుసారంగా వచ్చారు. కొత్త విషయమేమీ కాదు. కల్ప-కల్పము ఇలాగే వస్తాను. ఒక్క సెకెండు కూడా ముందు వెనుక అవ్వడం జరగదు. బాబా ఆత్మలమైన మనకు సత్యమైన జ్ఞానాన్ని ఇస్తున్నారు, మళ్ళీ కల్పము తర్వాత కూడా తండ్రి రావలసి ఉంటుంది అని పిల్లల మనసుకు తెలుస్తుంది. తండ్రి ద్వారా ఈ సమయంలో ఎవరైతే తెలుసుకున్నారో, వారు మళ్ళీ కల్పము తర్వాత తెలుసుకుంటారు. ఇప్పుడు పాత ప్రపంచము వినాశనమవుతుందని మళ్ళీ మనము సత్యయుగములో వచ్చి మన పాత్రను అభినయిస్తామని కూడా తెలుసు. సత్యయుగ స్వర్గవాసులుగా అవుతాము. ఇది బుద్ధిలో గుర్తుంది కదా. స్మృతి ఉండడం వలన సంతోషము కూడా ఉంటుంది. ఇది విద్యార్థి జీవితము కదా. మనము స్వర్గవాసులుగా అయ్యేందుకు చదువుతున్నాము. చదువు పూర్తి అయినంతవరకు ఈ సంతోషము స్థిరంగా ఉండాలి. ఎప్పుడు వినాశనానికి సామగ్రి తయారౌతుందో, అప్పుడు ఈ చదువు పూర్తి అవుతుందని తండ్రి అర్థం చేయించారు. అప్పుడు అగ్ని తప్పక అంటుకుంటుందని మీకు అర్థమవుతుంది. ఏర్పాట్లు జరుగుతూ ఉంటాయి కదా. ఒకరి పై ఒకరు వేడిగా అవుతూ ఉంటారు. నలువైపులా భిన్న-భిన్న ప్రకారాలైన సైన్యాలున్నాయి. అందరూ యుద్ధానికి సిద్ధమవుతూ ఉంటారు. యుద్ధము తప్పకుండా జరిగే విధంగా ఏదో ఒక అడ్డు వేస్తూ ఉంటారు. కల్పక్రితము వలె వినాశనము తప్పకుండా జరగాల్సిందే. పిల్లలైన మీరు చూస్తారు. ఒక్క నిప్పురవ్వ

ద్వారా ఎంత యుద్ధము జరిగిందో ఇంతకుముందు కూడా పిల్లలైన మీరు చూశారు. చెప్పినట్లుగా చేయకపోతే మేము ఈ బాంబులను చేతికి తీసుకోవలసి వస్తుందని ఒకరినొకరు భయపెట్టుకుంటూ ఉంటారు. మృత్యువు సమీపానికి వచ్చినప్పుడు తయారు చేయకుండా ఉండలేరు. ఇంతకుముందు కూడా యుద్ధము జరిగినప్పుడు బాంబులు ప్రయోగించారు. డ్రామా అలా ఉన్నింది కదా. ఇప్పుడు వేల కొలది బాంబులున్నాయి.

ఇప్పుడు అందరినీ వాపసు తీసుకెళ్ళేందుకు తండ్రి వచ్చి ఉన్నారని పిల్లలు తప్పకుండా తెలిపించాలి. ఓ పతితపావనా! రండి, ఈ ఛీ - ఛీ ప్రపంచము నుండి తీసుకెళ్ళండి అని అందరూ పిలుస్తున్నారు. ముక్తి - జీవన్ముక్తి అను రెండు పావన ప్రపంచాలున్నాయని పిల్లలకు తెలుసు. అందరి ఆత్మలు పవిత్రమై ముక్తిధామానికి వెళ్ళిపోతాయి. మృత్యులోకంగా చెప్పబడే ఈ దు:ఖధామము వినాశనమౌతుంది. మొదట అమరలోకముండేది, చక్రములో తిరిగి ఇప్పుడు మళ్ళీ మృత్యులోకానికి వచ్చారు. మళ్ళీ అమరలోకము స్థాపన అవుతుంది. అక్కడ అకాల మృత్యువులుండవు. కనుక దానిని అమరలోకమని అంటారు. శాస్త్రాలలో కూడా ఈ శబ్దముంది కాని ఎవ్వరికీ యథార్థమైన అర్థము తెలియదు. ఇప్పుడు తండ్రి వచ్చి ఉన్నారు, మృత్యులోకము తప్పకుండా వినాశనమవ్వాలని కూడా మీకు తెలుసు. ఇది నూరు శాతము నిశ్చితము. మీ ఆత్మను యోగబలము ద్వారా పవిత్రంగా చేసుకోండి, నన్ను స్మృతి చేసినట్లయితే వికర్మలు వినాశనమౌతాయి అని తండ్రి చెప్తున్నారు. కాని ఇది కూడా పిల్లలు స్మృతి చేయలేరు. తండ్రి నుండి వారసత్వము లేక రాజ్యాన్ని పొందేందుకు శ్రమ పడాలి కదా. సాధ్యమైనంత స్మృతిలో ఉండాలి. ఎంత సమయం మేము స్మృతిలో ఉన్నాము, ఎంతమందికి స్మృతినిప్పించాము? అని స్వయాన్ని పరిశీలించుకోవాలి. మన్మనాభవ, దీనిని మంత్రము అని కూడా అనలేరు. ఇది తండ్రి స్మృతి, దేహాభిమానాన్ని వదిలేయాలి. మీరు ఆత్మలు, ఇది మీ రథము. దీనితో మీరు ఎంత పని చేస్తారు! సత్యయుగములో మీరు దేవీదేవతలుగా అయి ఎలా రాజ్యము చేస్తారు! మళ్ళీ మీరు ఇదే అనుభవాన్ని పొందుతారు. ఆ సమయంలో వాస్తవంగా ఆత్మాభిమానులుగా ఉంటారు. ఈ శరీరము వృద్ధ శరీరమైపోయింది, దీనిని వదిలి క్రొత్తది తీసుకుంటాము అని ఆత్మ చెప్తుంది. దు:ఖపడే విషయమే లేదు. ఇక్కడైతే శరీరము వదలరాదని ఎంతగా డాక్టర్ల నుండి మందులు మొదలైనవి తీసుకుంటూ కష్టపడ్తారు. పిల్లలైన మీకు అనారోగ్యము మొదలైన సమయాలలో కూడా పాత శరీరము పై ఎప్పుడూ తిరస్కార భావము కలుగరాదు ఎందుకంటే ఈ శరీరములో జీవించి ఉండే తండ్రి నుండి ఆస్తిని పొందాలని మీకు తెలుసు. శివబాబా స్మృతి ద్వారానే పవిత్రంగా అవుతారు. ఇందులోనే శ్రమ ఉంది. కాని మొదట ఆత్మను తెలుసుకోవాల్సి వస్తుంది. మీకు ముఖ్యమైనది స్మృతియాత్రనే. స్మృతియాత్రలో ఉంటూ ఉంటూ మనము మళ్ళీ మూలవతనానికి వెళ్ళిపోతాము. మనము ఎక్కడి నివాసులమో అక్కడకు వెళ్ళిపోతాము. అదే మన శాంతిధామము. శాంతిధామము, సుఖధామాలను మీరు మాత్రమే తెలుసుకొని స్మృతి చేస్తారు. ఇతరులెవ్వరికీ తెలియదు. కల్పక్రితము తండ్రి నుండి ఎవరు వారసత్వము తీసుకున్నారో, వారే మళ్ళీ తీసుకుంటారు.

ముఖ్యమైనది స్మృతియాత్ర, భక్తిమార్గములోని యాత్రలు ఇప్పుడు సమాప్తమవుతాయి. భక్తిమార్గమే సమాప్తమైపోతుంది. భక్తిమార్గము ఏమిటో జ్ఞానము తెలుసుకున్నప్పుడే అర్థము చేసుకుంటారు. భక్తి ద్వారా భగవంతుడు లభిస్తారని అనుకుంటారు కాని భక్తికి ఫలంగా ఏమిస్తారో

తెలియదు. తండ్రి తప్పకుండా స్వర్గ సామ్రాజ్యపు ఆస్తినే ఇస్తారని పిల్లలైన మీకు తెలుసు. అందరికీ ఆస్తినిచ్చారు. ఎలా రాజా-రాణులు ఉన్నారో(యథా రాజా-రాణి తథా ప్రజా) అలా ప్రజలు కూడా స్వర్గవాసులుగా ఉండేవారు. తండ్రి చెప్తున్నారు - 5 వేల సంవత్సరాల క్రితము కూడా స్వర్గవాసులుగా చేశాను. ఇప్పుడు మళ్ళీ అలా తయారు చేస్తాను. మళ్ళీ మీరు 84 జన్మలు తీసుకుంటారు. ఇది బుద్ధిలో స్మృతి ఉండాలి, మర్చిపోరాదు. సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానము ఏదైతే బాబా వద్ద ఉందో, అదే పిల్లల బుద్ధిలో కూడా మెదులుతూ ఉంటుంది. మనము 84 జన్మలు ఎలా తీసుకుంటామో, ఇప్పుడు మళ్ళీ తండ్రి నుండి ఆస్తిని ఎలా తీసుకుంటామో అలా అనేకసార్లు తండ్రి నుండి వారసత్వము తీసుకున్నామని మీకు తెలుసు. ఎలా తీసుకున్నారో మళ్ళీ అలాగే తీసుకోండి అని తండ్రి చెప్తున్నారు. తండ్రి ఏమో అందరినీ చదివిస్తూ ఉంటారు, దైవీగుణాలు ధారణ చేసేందుకు కూడా హెచ్చరిక లభిస్తూ ఉంటుంది. స్వయాన్ని పరిశీలన చేసుకునేందుకు సాక్షీగా ఉంటూ నేను ఎంతవరకు పురుషార్థము చేస్తున్నాను? అని పరిశీలించుకోవాలి. మేము చాలా మంచి పురుషార్థము చేస్తున్నామని కొందరు అనుకుంటారు. భగవంతుడైన తండ్రి వచ్చి ఉన్నారని అందరికి అర్థం చేయించేందుకు ప్రదర్శనీలు మొదలైన వాటిని ఏర్పాటు చేస్తూ ఉంటారు. పాపం మనుష్యులంతా గాఢనిద్రలో మునిగి ఉన్నారు. జ్ఞానము ఎవ్వరికీ తెలియని కారణంగా భక్తియే శ్రేష్ఠమైనదని భావిస్తారు. మొదట మీలో కూడా జ్ఞానము ఏమైనా ఉండేదా? ఇప్పుడు మీకు తెలిసింది - జ్ఞానసాగరులు తండ్రి మాత్రమే, వారే భక్తికి ఫలాన్ని కూడా ఇస్తారు. ఎవరు ఎక్కువ భక్తి చేశారో, వారికి ఎక్కువ ఫలితము లభిస్తుంది, ఉన్నత పదవి పొందేందుకు వారే బాగా చదువుకుంటారు. ఇవి ఎంత మధురమైన విషయాలు! వృద్ధ స్త్రీలు మొదలైనవారికి కూడా చాలా సహజము చేసి అర్థం చేయిస్తారు. స్వయాన్ని ఆత్మ అని తెలుసుకొని తండ్రిని స్మృతి చేయండి. ఉన్నతాతి ఉన్నతమైవారు భగవంతుడైన శివుడు. శివ పరమాత్మాయ నమః అని అంటారు. ఆ శివుడే చెప్తున్నారు - నన్ను ఒక్కరినే స్మృతి చేసినట్లయితే, మీ వికర్మలు వినాశనమవుతాయి. ఇంతే, ఇది తప్ప వేరే కష్టమేదీ లేదు. ముందు ముందు మీరు శివబాబాను కూడా స్మృతి చేయడం ప్రారంభిస్తారు. ఆస్తి తీసుకోవాలి, జీవించి ఉండగానే తండ్రి నుండి ఆస్తి తీసుకునే తీరుతామని అంటారు. శివబాబా స్మృతిలో శరీరాన్ని వదిలి పెట్టినట్లయితే ఆ సంస్కారాన్ని తీసుకెళ్తారు. స్వర్గములోకి తప్పకుండా వస్తారు. ఎంతగా యోగము చేస్తారో అంత ఫలము లభిస్తుంది. ముఖ్యమైన విషయము - నడుస్తూ, తిరుగుతూ సాధ్యమైనంత బాబా స్మృతిలో ఉండాలి. మీ తల పై నుండి భారాన్ని దించుకోవాలి. కేవలం స్మృతి అవసరము. తండ్రి ఇంకే కష్టమూ ఇవ్వరు. అర్ధకల్పము నుండి పిల్లలు కష్టపడ్డారని నాకు తెలుసు. అందుకే ఇప్పుడు ఆస్తి తీసుకునే సహజ మార్గాన్ని తెలియజేసేందుకే వచ్చాను. కేవలం తండ్రిని స్మృతి చేయండి. ఇంతకుముందు కూడా స్మృతి చేసేవారు. కాని అప్పుడు జ్ఞానము ఉండేది కాదు. ఇలా నన్ను స్మృతి చేసినట్లయితే మీ వికర్మలు వినాశనమౌతాయి అని ఇప్పుడు తండ్రి జ్ఞానాన్ని ఇచ్చారు. ప్రపంచములో శివుని భక్తి చాలామంది చేస్తారు కాని వారి పరిచయము లేదు. నన్ను స్మృతి చేయండి అని ఈ సమయంలో తండ్రే స్వయంగా వచ్చి తన పరిచయమునిస్తున్నారు. మేము చాలా బాగా తెలుసుకున్నామని ఇప్పుడు మీరు భావిస్తారు. మేము బాప్‌దాదా వద్దకు వెళ్తున్నామని మీరంటారు. బాబా ఈ భాగీరథమును తీసుకున్నారు, భాగీరథము కూడా ప్రసిద్ధమైనది. తండ్రి కూర్చొని ఇతని ద్వారా జ్ఞానాన్ని వినిపిస్తారు. ఇది కూడా డ్రామాలో ఉంది. కల్ప-కల్పము ఈ భాగ్యశాలి రథము పై

వస్తారు. శ్యామసుందరుడు అని పిలువబడేవారు ఇతనే అని మీకు తెలుసు. ఇది కూడా మీరు మాత్రమే అర్థము చేసుకున్నారు. మనుష్యులు అర్జునుడు అని పేరు పెట్టేశారు. బ్రహ్మనే విష్ణువుగా, విష్ణువే బ్రహ్మగా ఎలా అవుతారో ఇప్పుడు తండ్రి యదార్థంగా అర్థం చేయిస్తున్నారు. మేము ఇప్పుడు బ్రహ్మపురవాసులము మళ్ళీ విష్ణుపురమువారిగా అవుతామని ఇప్పుడు పిల్లలలో వివేకముంది. విష్ణుపురము నుండి బ్రహ్మపురానికి వచ్చేందుకు 84 జన్మలు పడుతుంది, ఇది కూడా అనేకసార్లు అర్థం చేయించారు. ఇప్పుడు మీరు మళ్ళీ వింటున్నారు. కేవలం నన్ను స్మృతి చేయండి మీ వికర్మలు వినాశనమౌతాయని ఆత్మలకు తండ్రి అర్థం చేయిస్తున్నారు. కనుక మీకు సంతోషము కూడా కలుగుతుంది. ఈ ఒక్క అంతిమ జన్మ పవిత్రంగా అవ్వడం ద్వారా మనము పవిత్ర ప్రపంచానికి అధికారులుగా అవుతాము, మరి మనం ఎందుకు పవిత్రంగా అవ్వరాదు? మనమంతా ఒక్క తండ్రి పిల్లలమే. బ్రహ్మకుమార-కుమారీలము. అయినా ఆ దైహిక వృత్తి పరివర్తన అయ్యేందుకు సమయం పడ్తుంది. నెమ్మది నెమ్మదిగా చివర్లో కర్మాతీత అవస్థ వస్తుంది. ఈ సమయంలో ఎవరికైనా కర్మాతీత స్థితి రావడం అసంభవమే. కర్మాతీత స్థితి వచ్చినప్పుడు ఈ శరీరము కూడా ఉండదు, వదిలేయాల్సి ఉంటుంది. యుద్ధము ప్రారంభమైనప్పుడు ఒక్క తండ్రి స్మృతి మాత్రమే ఉండాలి. ఇందులో కష్టముంది. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. మేము ఎంత మాత్రము పురుషార్థము చేస్తున్నాము ? నడుస్తూ, తిరుగుతూ, కర్మలు చేస్తూ ఎంత సమయం బాబా స్మృతిలో ఉంటున్నాము? అని సాక్షిగా ఉండి స్వయాన్ని చూసుకోవాలి.
2. ఈ శరీరముతో ఎప్పుడూ విసిగిపోరాదు. ఈ శరీరములోనే జీవించి ఉండి తండ్రి నుండి వారసత్వాన్ని పొందాలి. స్వర్గవాసులుగా అయ్యేందుకు ఈ జీవితంలో పూర్తిగా చదువుకోవాలి.

## వరదానము :- "మాస్టర్ రచయిత స్టేజి ద్వారా ఆపదలలో కూడా మనోరంజనాన్ని అనుభవం చేసే సంపూర్ణ యోగీ భవ"

మాస్టర్ రచయిత స్టేజి పై స్థితమై ఉండుట వలన అత్యంత పెద్ద ఆపద కూడా ఒక మనోరంజన దృశ్యంగా అనుభవమవుతుంది. ఎలాగైతే మహావినాశనం జరిగే ఆపదను కూడా స్వర్గం గేటు తెరిచే సాధనంగా చెప్తారో, అలా ఎలాంటి చిన్న పెద్ద సమస్య అయినా, ఆపద అయినా మనోరంజన రూపంగా కనిపించాలి. అయ్యో, అయ్యో కు బదులు ఓహో అను శబ్ధము వెలువడాలి. దు:ఖము కూడా సుఖ రూపంగా అనుభవమవ్వాలి. సుఖ-దు:ఖాల జ్ఞానము ఉన్నా వాటి ప్రభావంలోకి రారాదు. దు:ఖాన్ని కూడా సుఖమునిచ్చే రోజులు వచ్చేందుకు బలిహారిగా భావించాలి - అప్పుడు సంపూర్ణ యోగులని అంటారు.

## స్లోగన్ :- "హృదయ సింహాసనాన్ని వదిలి సాధారణ సంకల్పాలు చేయడం అనగా భూమి పై కాలు ఉంచడం."